ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ),
MSME , Trademark , Food License (Fssai) ,
ISI License , RNI , Trust (12A-80G),
రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్,
న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను.
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్: 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సోమవారం 10-11-2025 సంపుటి : 1 సంచిక :144 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## బెడిసికొట్టిన శాంతి చర్చలు.. పాకిస్థాన్‌పై ఆఫ్ఘనిస్థాన్ ఫైర్

ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో జరిగిన భేటీ

పాకిస్థాన్ బాధ్యతారహితంగా వ్యవహరించిందన్న తాలిబన్లు




టీటీపీ ఉగ్రవాదులకు తాలిబన్లు ఆశ్రయం ఇస్తున్నారని పాక్ ఆరోపణ

చర్చలు విఫలమవడంతో సరిహద్దు ఘర్షణలు కొనసాగే అవకాశం

## ఎన్నికల్లో మునిగిపోవడానికి ప్రాక్టీస్ చేస్తున్నారు

చేపల వేట కోసం చెరువులోకి దిగిన రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు




బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగిన రాహుల్ గాంధీ

మత్స్యకారులతో కలిసి చేపలు పట్టి, అనంతరం సరదాగా ఈత కొట్టిన అగ్రనేత

## భారత కుబేరుల ఉదారత.. రూ. 10,380 కోట్లు విరాళం..




దాతృత్వంలో మరోసారి శివ్ నాడార్ టాప్

దాతృత్వంలో మరోసారి శివ్ నాడార్ అగ్రస్థానం




## చొరబాటుదారుల పేరుతో ముస్లింలను కించపరుస్తున్నారు

- అది మీ వైఫల్యమే... మోదీ, నితీశ్ బాధ్యత వహించాలి
- దేశంలోకి చొరబాటుదారులు వస్తుంటే అది ప్రభుత్వ వైఫల్యమేనని వ్యాఖ్య
- విభజన సమయంలో సీమాంచల్ ముస్లింలు భారత్‌నే ఎంచుకున్నారన్న ఒవైసీ

# ఈసారి లక్ష లక్ష్యంగా పార్టీ నేతలు

- ★ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య తీవ్ర పోటీ
- ★ లక్ష ఓట్ల లక్ష్యమే జూబ్లీహిల్స్ గెలుపు!
- ★ లక్ష ఓట్లు సాధిస్తేనే గెలుపు సాధ్యమని అంచనాలు
- ★ గెలుపోటముల లెక్కల్లో మునిగితేలుతున్న అన్ని పార్టీల అభ్యర్థులు



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కోసం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీల నుంచి హేమాహేమీలైన రాష్ట్ర నేతలు గల్లీలు, బస్తీల్లో తిరుగుతున్నారు. వందల సంఖ్యల్లో పెద్ద నేతలు తమ ఇళ్ల ముందుకు వస్తుండటం చూసి ప్రజలు ఆశ్చర్య పోతున్నారు. ప్రతి ఒక్క ఓటు కోసం ఎంతో ఆరాటపడుతున్నారు. ఏ ఒక్క ఓటూ ప్రత్యర్థికి పోవద్దని భావిస్తున్నారు.

ఇంతకీ, జూబ్లీ'హిల్స్'ను ఎక్కాలంటే ఎన్ని ఓట్లు రావాలో అవలోకిస్తే.. ప్రస్తుతం జరగనున్న ఉప ఎన్నికలో అర్హులైన ఓటర్లు దాదాపు 4 లక్షల మంది ఉన్నారు. మిగతా..2లో

ప్రజల దృష్టి మరల్చేందుకే నాపై

## రేవంత్ రెడ్డి ఆరోపణలు

- ➢ఎన్నికల హామీల అమలులో రేవంత్ విఫలమయ్యారన్న కిషన్ రెడ్డి
- ➢హైకమాండ్‌కు భయపడే కేసీఆర్‌పై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణ
- ➢తెలంగాణ అభివృద్ధిపై చర్చకు రావాలని రేవంత్, కేసీఆర్‌కు సవాల్



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే ప్రజల దృష్టిని మరల్చడానికి తనపైన, బీజేపీపైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మిగతా..2లో

అనంతపురం జిల్లాకు

## రుణపడి ఉంటాం

### టీడీపీతోనే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం.. కురుబ సోదరులను గుండెల్లో పెట్టుకుంటాం

- ➢టీడీపీకి అండగా నిలిచిన కురుబ సోదరులను మరువమన్న మంత్రి
- ➢కనకదాస జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని ప్రకటన
- ➢కళ్యాణదుర్గంలో భక్త కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించిన లోకేశ్
- ➢భైరవానితిప్ప ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత టీడీపీదేనని హామీ
- ➢పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నెరవేరుస్తామని స్పష్టీకరణ



అమరావతి: టీడీపీకి అండగా నిలిచిన కురుబ సోదరులను ఎప్పటికీ మరువబోమని, వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. భక్త కనకదాస 538వ జయంతిని పురస్కరించుకుని కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్త కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం లోకేశ్ ప్రసంగించారు. తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఇకపై కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా మిగతా..2లో

2లో

## ఏపీలో 1,150 లాయర్ల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున సాయం

- మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం అండ
- 1,150 కుటుంబాలకు రూ. 46 కోట్ల నిధుల విడుదల
- అర్హుల జాబితాతో రెండు జీవోలను జారీ చేసిన న్యాయశాఖ
- ఏపీ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ కింద నిధుల కేటాయింపు

## రిజర్వ్ ఫారెస్ట్ వాచ్ టవర్ నుంచి అటవీ ప్రాంతం పరిశీలన

### కాలినడకన మామండూరు అడవుల్లో తిరిగిన మంత్రి పవన్ కల్యాణ్...

- ★ అడవిలో 4 కిలోమీటర్లకు పైగా ప్రయాణం, 2 కిలోమీటర్ల కాలినడక
- ★ ఎర్రచందనం, అరుదైన మొక్కల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్న పవన్
- ★ ఎర్రచందనం స్మగ్లింగ్, నిరోధక చర్యలపై అధికారులతో సమీక్ష
- ★ గుంటి మడుగు వాగు వద్ద కూర్చుని పరిసరాలను ఆసక్తిగా గమనించిన వైనం



అమరావతి: ఏపీ ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. శనివారం నాడు తిరుపతి జిల్లాలోని మామండూరు అటవీ ప్రాంతాన్ని ఆయన సందర్శించి, అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. అటవీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన నేరుగా అడవిలోకి వెళ్లి పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ అటవీ మార్గంలో నాలుగు కిలోమీటర్లకు పైగా ప్రయాణించారు. మిగతా..2లో

## పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీలు ఖరారు..

- రాష్ట్రపతి ఆమోదం
- డిసెంబర్ 1 నుంచి 19 వరకు సెషన్ నిర్వహణ
- ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం
- ఫలప్రదమైన చర్చ జరగాలని ఆశిస్తున్నట్లు కిరణ్ రిజిజు ట్వీట్



ఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ తేదీలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ప్రకటిస్తూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మిగతా..2లో




## సీఎం రేవంత్ భాష వీధి రౌడీలా ఉంది

### కవిత తీవ్ర విమర్శలు

- ఫీజు బకాయిలు చెల్లించకుండా బెదిరింపులా అని కవిత ఫైర్
- కాలేజీ యాజమాన్యాల తాట తీస్తామనడం దారుణమని విమర్శ
- మాట తప్పింది మీరు, బంద్‌కు కారణమూ మీరేనని ఆరోపణ

## నాలుగు కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించిన మోదీ..!

- వారణాసిలో నాలుగు కొత్త వందే భారత్ రైళ్ల ప్రారంభం
- ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా పచ్చజెండా
- బెంగళూరు, ఖజురహో, సహరాన్‌పూర్, ఢిల్లీకి కొత్త సర్వీసులు
- ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం, కనెక్టివిటీయే లక్ష్యం
- కీలక మార్గాల్లో గణనీయంగా తగ్గనున్న ప్రయాణ సమయం



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పార్లమెంటరీ నియోజకవర్గమైన ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి నాలుగు కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. బనారస్ రైల్వే స్టేషన్‌లో జరిగిన మిగతా..2లో

# అనంతపురం జిల్లాకు రుణపడి ఉంటాం

మొదటి పేజి తరువాయి

కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహిస్తున్నామని, ఇది తన జీవితంలో మరిచిపోలేని రోజని అన్నారు.

పాదయాత్ర హామీలు నెరవేరుస్తాం

తన యువగళం పాదయాత్రలో కురుబ సోదరుల సమస్యలను దగ్గర నుంచి చూశానని, వారి కోరిక మేరకే కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించామని లోకేశ్ గుర్తుచేశారు. కురుబల ఆరాధ్య దైవమైన బీరప్ప గుడులను టీటీడీ సహకారంతో నిర్మిస్తామని, పూజారులకు గౌరవ వేతనం అందించేందుకు త్వరలోనే జీవో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కురుబ కమ్యూనిటీ భవనాలను రాబోయే 12 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. గొర్రెల పెంపకందారుల కోసం షెడ్ల నిర్మాణం, బీమా సౌకర్యం, దాణా, మేత భూముల సమస్యలను పరిష్కరించి వారి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

అనంతపురం జిల్లాకు రుణపడి ఉంటాం

టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని, టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని లోకేశ్ అన్నారు. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌ను మూడుసార్లు, హరికృష్ణను ఒకసారి, బాలకృష్ణను మూడుసార్లు గెలిపించిన ఘనత ఈ జిల్లాదేనని గుర్తు చేసుకున్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భైరవానితిప్ప ప్రాజెక్టును టీడీపీ ప్రభుత్వమే పూర్తి చేస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, జిల్లాలో హార్టికల్చర్‌కు చేయూతనిచ్చి తలసరి ఆదాయంలో రాష్ట్రంలో మూడో స్థానానికి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా జిల్లాలో సేవలందిస్తున్న అర్డీటీ సంస్థ లైసెన్సు పునరుద్ధరణకు కేంద్రంతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.

టీడీపీతోనే కురుబలకు రాజకీయ గుర్తింపు

టీడీపీ హయాంలోనే కురుబ సామాజిక వర్గానికి రాజకీయంగా, ఆర్థికంగా స్వాతంత్ర్యం వచ్చిందని లోకేశ్ అన్నారు. కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.300 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఎస్.రామచంద్ర రెడ్డి, బీకే పార్థసారథి, నేటి మంత్రులు సవిత, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు వంటి ఎందరో కురుబ నేతలను టీడీపీ ప్రోత్సహించిందని వివరించారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో చీకటి పాలన చూశామని, బీసీలపై దాడులు జరిగాయని విమర్శించారు. అందుకే ప్రజలు కూటమి ప్రభుత్వానికి 94 శాతం సీట్లతో చారిత్రక విజయాన్ని అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కురుబ సవిత, పయ్యావుల కేశవ్, ఎంపీలు పార్థసారథి, బస్తిపాటి నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కురుబ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రిజర్వ్ ఫారెస్ట్ వాచ్ టవర్ నుంచి అటవీ ప్రాంతం పరిశీలన

మొదటి పేజి తరువాయి

అనంతరం వాహనం దిగి దాదాపు రెండు కిలోమీటర్ల మేర కాలినడకన అడవి లోపలికి వెళ్లారు. దారి పొడవునా ప్రతి చెట్టును, మొక్కను ఆసక్తిగా గమనిస్తూ అటవీ శాఖ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎర్రచందనం, అంకుడు, తెల్లమద్ది, వెదురుతో పాటు కేవలం శేషాచలం అడవుల్లో మాత్రమే కనిపించే అరుదైన వృక్ష జాతుల గురించి ఆరా తీశారు. అనంతరం నేపిరియర్ రిజర్వ్ ఫారెస్ట్ వద్ద ఉన్న వాచ్ టవర్ ఎక్కి మొత్తం అటవీ ప్రాంతాన్ని వీక్షించారు. వెలిగొండ, శేషాచలం అటవీ సరిహద్దులు, స్వర్ణముఖి నది ఉద్భవించే ప్రాంతం వంటి భౌగోళిక అంశాలపై అధికారులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పర్యటనలో భాగంగా గుంటి మడుగు వాగు వద్ద కాసేపు కూర్చుని, అక్కడి ప్రశాంత వాతావరణాన్ని, పరిసరాలను తిలకించారు. వాగుకు ఇరువైపులా ఉన్న చెట్ల రకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్న ఎర్రచందనం స్మగ్లింగ్‌పై మంత్రి దృష్టి సారించారు. స్మగ్లింగ్‌ను అరికట్టడానికి చేపడుతున్న చర్యలు, టాస్క్‌ఫోర్స్ పనితీరు, అటవీ సిబ్బంది నిర్వహిస్తున్న కూంబింగ్ ఆపరేషన్ల గురించి అధికారులతో సమీక్షించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకుని, వారికి పలు సూచనలు చేశారు. మామండూరు అటవీ ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఇక, తిరుపతి జిల్లా మంగళంలో అటవీ శాఖకు చెందిన ఎర్ర చందనం గొడౌన్ ను కూడా పరిశీలించారు. 8 గోడౌన్లలో ఉన్న ఎర్రచందనం లాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ, బీ, సీ, నాన్ గ్రేడ్ ల వారీగా దుంగల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి గోడౌన్ లో రికార్డులు పరిశీలించారు. ప్రతి ఎర్ర చందనం దుంగకి ప్రత్యేక బార్ కోడింగ్, లైవ్ ట్రాకింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, పట్టుబడిన దగ్గర నుంచి అమ్ముడుపోయే వరకు ఒక్క దుంగ కూడా మిస్ అవకూడదని అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

# ఈసారి లక్ష లక్ష్యంగా పార్టీ నేతలు

మొదటి పేజి తరువాయి

నగరంలో ఎప్పుడు ఎన్నిక జరిగినా పోలింగ్ శాతం తక్కువగా ఉంటోంది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ 50 శాతానికంటే తక్కువ పోలింగే నమోదైంది. ఈసారి పార్టీల ప్రయత్నాలతో ఎక్కువ పోలింగ్ జరుగుతుందనుకున్నా 50 శాతం పోలింగ్ నమోదైతే 2 లక్షల ఓట్లన్న మాట. వాటిల్లో సగం అంటే లక్ష ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలుపు ఖాయమే. ఓట్లు ఎక్కువగా చీలి అందరు అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తే 50 వేలు వచ్చినా ఆశ్చర్యం లేదు. మొత్తం మీద లక్ష ఓట్లు పొందడం ఇప్పుడు కీలకం. గత ఎన్నికల సరళి చూసినా 50 వేల ఓట్లు దాటిన అభ్యర్థులే గెలిచారు. నియోజకవర్గం ఏర్పడ్డాక తొలి ఎన్నికలో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డికి దాదాపు 54 వేల ఓట్లు, మలి ఎన్నికలో గెలిచిన గోపీనాథ్‌కు దాదాపు 51 వేల ఓట్లే వచ్చాయి. ఆ తర్వాతి ఎన్నికల్లో ఓట్లు పెరిగే కొద్దీ మెజార్టీ పెరిగింది. మూడు పర్యాయాలు గెలిచిన గోపీనాథ్ 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి గెలిచారు. తర్వాత రెండు పర్యాయాలు బీఆర్ఎస్ నుంచి గెలిచారు. విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. ఇక గత ఎన్నికల్లో గోపీనాథ్‌కు 80 వేల ఓట్లు రావడంతో..సునీతకు ఈసారి లక్ష లక్ష్యంగా ఆ పార్టీ నేతలు పనిచేస్తున్నారు.

టఫ్ ఫైట్ .. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో ఏ పార్టీ గెలుస్తుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఎవరి గెలుపైనా నేరోగానే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో రెండు పార్టీలూ ఒక్క ఓటును కూడా ఎంతో కీలకంగా భావిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ నుంచి ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు, బీఆర్ఎస్ నుంచి మాజీలైన మంత్రులు, కార్పొరేషన్ల చైర్మన్లతో పాటు రెండు పార్టీల్లోని తాజా, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు వందల సంఖ్యలో గల్లీ, బస్తీ, కాలనీ అనే తేడా లేకుండా ఇల్లిల్లూ ఒక్కసారి కాదు రెండు మూడు పర్యాయాలు తిరుగుతున్నారు. అంతేకాదు. కులాలు, వర్గాలు, మతాల వారీగానూ గంపగుత్త ఓట్ల కోసం వెంపర్లాడుతున్నారు. ఎంత డబ్బు వెదజల్లడానికైనా వెనుకాడటం లేరనే ప్రచారం జరుగుతోంది.

| ఎన్నిక | ఓటర్లు | పోలింగ్ శాతం | విజేత | ఓట్లు(శాతం) |
|---|---|---|---|---|
| 2009 | 259416 | 52.76 | పి. విష్ణువర్ధన్‌రెడి | 54,519 (39.8) |
| 2014 | 329522 | 50.18 | ఎం.గోపీనాథ్ | 50,898 (31.0) |
| 2018 | 341537 | 45.59 | ఎం.గోపీనాథ్ | 68,979 (44.8) |
| 2023 | 385265 | 47.49 | ఎం.గోపీనాథ్ | 80,549 (43.94) |
| 2025 | 401365 | ? | ?? | ??? |

సంపన్న ప్రాంతం కాదు

గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో భాగంగా ఉన్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం 2008 డీలిమిటేషన్‌తో ఏర్పడింది. తొలిసారిగా 2009లో ఎన్నికలు జరిగాయి. జూబ్లీహిల్స్ అనగానే సంపన్న ప్రాంతమనే గుర్తుకొస్తుంది. కానీ, సంపన్న ప్రాంతాల కంటే పేద ప్రాంతాలే ఎక్కువ. ఉన్నతవర్గాల ప్రజలు, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఉండే ప్రాంతాలు ఈ నియోజకవర్గంలోనే అనుకుంటారు కానీ. వారంతా ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎక్కువగా ఉన్నారు. డీలిమిటేషన్ సందర్భంగా రాజకీయ కారణాలు కావచ్చు. ఇతరత్రా కావచ్చు కానీ ఈ నియోజకవర్గమే గందరగోళంగా ఉంది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, రోడ్‌నెంబర్ 36, ఫిల్మ్‌నగర్ వంటి ప్రాంతాలు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉంటాయనే అనుకుంటారు. కానీ అవి ఈ నియోజకవర్గంలో లేవు. నియోజకవర్గం షేక్‌పేట నుంచి గోల్కొండ దాకా విస్తరించి ఉండటంతో నియోజకవర్గ సరిహద్దులు అధికారులకు తప్ప సామాన్యులకు అర్థం కావు. సినీపరిశ్రమలో పనిచేసే జూనియర్ ఆర్టిస్టులు, కార్మికులు, తదితరులుండే యూసుఫ్‌గూడ, బోరబండ వంటి ప్రాంతాలు మాత్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఇక నియోజకవర్గంలోని దాదాపు 24 శాతం మైనార్టీ ఓటర్లు అభ్యర్థుల గెలుపు ఓటములను శాసించే పరిస్థితిలో ఉన్నారు.

అయోమయంగా సర్వేలు ... ఇక వివిధ చానళ్లు, యూట్యూబ్ సంస్థల సర్వేలూ ప్రజల్లో గందరగోళం రేపుతున్నాయి. వాటిని సైతం నమ్మే పరిస్థితి లేదంటున్నారు. చివరి వరకు అన్నింటినీ మనీ మేనేజ్ చేస్తుందంటున్నారు. పోలింగ్ నాటినుంచే మొదలయ్యే అవినీతితో గెలిచేవారెవరైనా..ఏ మేరకు నీతిమంతులుగా మిగులుతారో కాలమే సమాధానం చెబుతుంది.

ఓట్ షేరింగ్ ఇలా..

పోలైన ఓట్లలో గెలిచిన అభ్యర్థులకు తొలి రెండు ఎన్నికల కంటే, మలి రెండు ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది. 2014లో గోపీనాథ్‌కు కేవలం 31 శాతం ఓట్లు రాగా, 2023కు దాదాపు 44 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు లక్ష ఓట్లు వస్తే (పోలింగ్ శాతం భారీగా పెరిగినా) గెలుస్తారన్నమాట. కానీ, కనిపిస్తున్న పోటీ తీవ్రత దష్ట్యా అన్నీ కూడా అవసరం కాబోదని కొందరు లెక్కలేస్తున్నారు.

# పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీలు ఖరారు..

మొదటి పేజి తరువాయి

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఫలప్రదమైన, అర్థవంతమైన చర్చలు జరగాలని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అత్యంత క్లుప్తమైన శీతాకాల సమావేశాల్లో ఇది ఒకటి కావడం గమనార్హం. గతేడాది శీతాకాల సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20న ముగిశాయి. 26 రోజుల వ్యవధిలో లోక్‌సభ 20 సార్లు, రాజ్యసభ 19 సార్లు సమావేశమయ్యాయి. ఆ సెషన్‌లో లోక్‌సభ ఉత్పాదకత 54.5 శాతంగా, రాజ్యసభ ఉత్పాదకత 40 శాతంగా నమోదైంది. అప్పుడు ఐదు బిల్లులను ప్రవేశపెట్టగా, 'భారతీయ వాయుయాన్ విధేయక్ 2024' బిల్లును ఉభయ సభలు ఆమోదించాయి. ఇటీవల జరిగిన వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు 21 రోజుల పాటు జరిగాయి. ఆ సమావేశాల్లో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో ఉభయ సభల్లో ఉత్పాదకత గణనీయంగా తగ్గింది. లోక్‌సభ కేవలం 31 శాతం, రాజ్యసభ 38.8 శాతం ఉత్పాదకతను మాత్రమే నమోదు చేశాయి. ఆ సెషన్‌లో 15 బిల్లులు చట్టరూపం దాల్చాయి.

# నాలుగు కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించిన మోదీ..!

మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమంలో బనారస్-ఖజురహో, లక్నో-సహరాన్‌పూర్, ఫిరోజ్‌పూర్-ఢిల్లీ, ఎర్నాకుళం-బెంగళూరు మార్గాల్లో ఈ కొత్త సెమీ-హైస్పీడ్ రైలు సర్వీసులను ఆయన జాతికి అంకితం చేశారు. ఈ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ వందే భారత్ రైళు దేశంలో కనెక్టివిటీని మెరుగుపరచడమే కాకుండా, ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయని తెలిపారు. "వందే భారత్, నమో భారత్, అమృత్ భారత్ వంటి రైళ్లు భారతీయ రైల్వేలో ఒక నవశకానికి పునాదులు వేస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక ప్రగతిలో మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని, భారత్ కూడా అదే మార్గంలో వేగంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

కొత్త రూట్ల వివరాలు:

బనారస్-ఖజురహో: ఈ రైలు వారణాసి, ప్రయాగ్‌రాజ్, చిత్రకూట్ వంటి పుణ్యక్షేత్రాలను యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన ఖజురహోతో కలుపుతుంది. దీనివల్ల ప్రస్తుతం ప్రత్యేక రైళ్లలో పడుతున్న సమయం కన్నా 2 గంటల 40 నిమిషాలు ఆదా అవుతుందని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. లక్నో-సహరాన్‌పూర్: ఈ మార్గంలో ప్రయాణ సమయం సుమారు గంట వరకు తగ్గనుంది. లక్నో, బరేలీ, మొరాదాబాద్, సహరాన్‌పూర్ ప్రయాణికులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. పవిత్ర నగరమైన హరిద్వార్‌కు వెళ్లేవారికి కూడా ఇది సౌకర్యంగా ఉంటుందని అధికారులు వివరించారు. ఫిరోజ్‌పూర్-ఢిల్లీ: పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, పాటియాలా వంటి కీలక నగరాలను దేశ రాజధాని ఢిల్లీతో వేగంగా అనుసంధానించే ఈ రైలు, ప్రయాణ సమయాన్ని 6 గంటల 40 నిమిషాలకు తగ్గిస్తుంది. సరిహద్దు ప్రాంతాల్లో వాణిజ్యం, పర్యాటకం, ఉపాధి అవకాశాలను పెంచడానికి ఈ సర్వీస్ దోహదపడుతుందని కేంద్రం పేర్కొంది. ఎర్నాకుళం-బెంగళూరు: దేశంలోని రెండు ప్రధాన ఐటీ, వాణిజ్య కేంద్రాలైన ఈ నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని ఈ వందే భారత్ రైలు 2 గంటలకు పైగా తగ్గిస్తుంది. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలు, పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడనుంది.

# ప్రజల దృష్టి మరల్చేందుకే నాపై రేవంత్ రెడ్డి ఆరోపణలు

ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు? ఆ హామీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలి. ఆ విషయం పక్కన పెట్టి బీఆర్ఎస్, బీజేపీ కలిసిపోయాయని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. గతంలో ఎన్నికల సమయంలోనూ రేవంత్ రెడ్డి ఇలాంటి తప్పుడు ప్రచారాలే చేశారు. నాపై ఎన్ని వ్యక్తిగత విమర్శలు చేసినా భయపడేది లేదు. తెలంగాణ అభివృద్ధి విషయంలో నాకు రేవంత్ సర్టిఫికెట్ అస్సలు అవసరం లేదు. ఈ రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో ప్రజలకు స్పష్టంగా తెలుసు" అని కిషన్ రెడ్డి అన్నారు. తమది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మాదిరిగా అవినీతి, కుటుంబ పార్టీ కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం మాత్రమే బీజేపీకి తెలుసని, తమ పాలనపై ఇప్పటివరకు ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని గుర్తుచేశారు. ఫేక్ వీడియోలతో తమ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. "కాంగ్రెస్ హైకమాండ్‌కు భయపడి రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణ అభివృద్ధిపై నేను చేసిన పనుల గురించి వివరణ వినే ధైర్యం కేసీఆర్‌కు, రేవంత్ రెడ్డికి ఉందా?" అని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైన 'ఫెయిల్యూర్ ప్రభుత్వం' అని ఆయన దుయ్యబట్టారు.

# 48 మంది ఎమ్మెల్యేలపై చంద్రబాబు సీరియస్

అమరావతి: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ వంటి కీలక కార్యక్రమాలకు హాజరుకాని 48 మంది ఎమ్మెల్యేల తీరుపై ఆయన సీరియస్‌గా స్పందించారు. ఈ విషయంలో ఏమాత్రం ఉపేక్షించవద్దని, సంబంధిత ఎమ్మెల్యేలందరికీ తక్షణమే నోటీసులు జారీ చేయాలని పార్టీ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలతో మమేకమవుతూ, ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొన్నప్పుడే ప్రభుత్వ ఉద్దేశాలు నెరవేరతాయని, పాలనా వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులే ఇలాంటి కార్యక్రమాలకు దూరంగా ఉండటం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరాలంటే ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, వారి నిర్లక్ష్యం వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని సీఎం పేర్కొన్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో, ప్రభుత్వ కార్యక్రమాలకు గైర్హాజరైన 48 మంది ఎమ్మెల్యేలకు పార్టీ కార్యాలయ సిబ్బంది త్వరలోనే నోటీసులు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక... హైదరాబాద్ సీపీ కీలక ఆదేశాలు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు వీలుగా నియోజకవర్గ వ్యాప్తంగా కఠిన ఆంక్షలు విధిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఉపఎన్నిక పోలింగ్ సందర్భంగా ఈ నెల 9వ తేదీ (ఆదివారం) సాయంత్రం 6 గంటల నుంచి 11వ తేదీ (మంగళవారం) సాయంత్రం 6 గంటల వరకు నియోజకవర్గం పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బులను పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు జరగనున్న 14వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు మళ్లీ అమల్లో ఉంటాయని వివరించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. అదేవిధంగా, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై టపాసులు పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం వంటి వాటిపై నిషేధం ఉంటుందని తెలిపారు. పోలీసు ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

## 'పేపర్‌లో మధ్యాహ్న భోజనమా'..!

# హృదయం ముక్కలైందన్న రాహుల్



ఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డించినట్లు కనిపిస్తున్న దృశ్యాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఇది చూసి తన హృదయం తల్లడిల్లిందన్నారు. ఇంత దయనీయ స్థితిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. "మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని న్యూస్‌పేపర్‌లో వడ్డిస్తున్నట్లు తెలుసుకుని నా హృదయం ముక్కలైంది. ఈ పిల్లలపైనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కానీ, వారికి కనీస గౌరవం దక్కడం లేదు. అక్కడ అభివృద్ధి అంతా భ్రమే. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని అధికారంలోకి వస్తున్నారు. ఇటువంటి దుర్భర స్థితిలో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. శ్యోపుర్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఈ వీడియో తీసినట్లు సమాచారం. ఈ వ్యవహారం కాస్త నెట్టింట వైరల్‌గా మారడంతో.. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. స్వయం సహాయక సిబ్బంది సేవలను నిలిపివేశారు. నెటిజన్లు దీన్ని ఖండించారు. మధ్యాహ్న భోజనం అనేది పిల్లల హక్కు అని పేర్కొన్నారు. పోషకాహారం పేరిట అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారంటూ విమర్శించారు.

# బెడిసికొట్టిన శాంతి చర్చలు.. పాకిస్థాన్‌పై ఆఫ్ఘనిస్థాన్ ఫైర్

ఢిల్లీ: పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఖతార్, టర్కీ దేశాల మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాలు ఎటువంటి ఫలితం తేలకుండానే ముగిశాయి. చర్చలు విఫలమవడానికి పాకిస్థాన్ బాధ్యతారహిత వైఖరే కారణమని ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ పాలకులు తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇరు దేశాల మధ్య ఘర్షణలు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. శనివారం ఉదయం తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ చర్చల్లో పాకిస్థాన్ తన భద్రతా వైఫల్యాలన్నింటినీ ఆఫ్ఘనిస్థాన్‌పై నెట్టే ప్రయత్నం చేసింది. అదే సమయంలో ఆఫ్ఘన్ భద్రతకు గానీ, తమ సొంత భద్రతకు గానీ బాధ్యత వహించడానికి ఎలాంటి సుముఖత చూపలేదు. పాక్ అనుసరించిన బాధ్యతారహితమైన, సహకరించని వైఖరి వల్లే చర్చలు విఫలమయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, పాకిస్థాన్ కూడా చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని శుక్రవారమే అంగీకరించింది. అంతర్జాతీయ సమాజానికి ఇచ్చిన హామీ మేరకు తాలిబన్లు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో విఫలమయ్యారని పాక్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా, తమ దేశంలో అనేక దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలను తాలిబన్లు ఖండించారు. ఏ దేశంపైనా దాడికి తమ భూభాగాన్ని ఉపయోగించుకోనివ్వబోమని, అదే సమయంలో తమ సార్వభౌమత్వానికి భంగం కలిగించే చర్యలను గట్టిగా ప్రతిఘటిస్తామని వారు స్పష్టం చేశారు. గత కొన్ని నెలలుగా ఇరు దేశాల సరిహద్దుల్లో ఘర్షణలు తీవ్రమయ్యాయి. అక్టోబర్ ప్రారంభం నుంచి జరిగిన దాడుల్లో ఆఫ్ఘన్ వైపు 50 మంది పౌరులు మరణించారని, 447 మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. మరోవైపు, తాలిబన్ల దాడుల్లో 23 మంది సైనికులు మరణించారని, 29 మంది గాయపడ్డారని పాక్ సైన్యం ప్రకటించింది. చర్చలు విఫలమవడంతో మధ్యవర్తిత్వం వహించిన ఖతార్, టర్కీలకు పాకిస్థాన్ కృతజ్ఞతలు తెలుపుతూనే, తమ ప్రజలను, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# ఎన్నికల్లో మునిగిపోవడానికి ప్రాక్టీస్ చేస్తున్నారు

బీహార్: కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకచోట మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. బీహార్ చేపలను చూడటానికి పెద్దపెద్దవారు వస్తున్నారని, ఎన్నికల్లో మునిగిపోవడానికి ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి రాహుల్ గాంధీ చేపలు పట్టేందుకు వెళ్లారు. ఆయన వెంట మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, ఉప ముఖ్యమంత్రి అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు. చేపలు పట్టేందుకు సాహ్నీ నీళ్లలోకి దిగి వల వేశారు. కాసేపటికి రాహుల్ గాంధీ కూడా నీళ్లలోకి దిగి మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. సరదాగా ఈత కొట్టారు. ఈ సందర్భంగా జాలర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారికి పలు హామీలు గుప్పించారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపల మార్కెట్ల ఏర్పాటు, మత్స్య సంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చారు.

# భారత కుబేరుల ఉదారత.. రూ. 10,380 కోట్లు విరాళం..

ఢిల్లీ: భారతదేశంలో అత్యంత ఉదారంగా విరాళాలు ఇచ్చే వారి జాబితా విడుదలైంది. ఎడెల్‌గివ్, హురూన్ ఇండియా తాజాగా విడుదల చేసిన 'ఫిలాంత్రపీ లిస్ట్ 2024-25'లో హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్, ఆయన కుటుంబం మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వారు ఏకంగా రూ. 2,708 కోట్ల భారీ విరాళం అందించారు. ఇది సగటున రోజుకు రూ. 7.40 కోట్లతో సమానం. గత ఐదేళ్లలో శివ్ నాడార్ ఈ జాబితాలో చోటు దక్కించుకోవడం ఇది నాలుగోసారి.

శివ్ నాడార్ తర్వాత రెండో స్థానంలో ముకేశ్ అంబానీ

ఈ జాబితా ప్రకారం, 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 మధ్య దేశంలోని 191 మంది అత్యంత ధనవంతులు కలిసి మొత్తం రూ. 10,380 కోట్లను విరాళంగా అందించారు. ఇది గత మూడేళ్లతో పోలిస్తే 85 శాతం అధికం కావడం గమనార్హం. శివ్ నాడార్ తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ రూ. 626 కోట్లతో రెండో స్థానంలో, బజాజ్ ఫ్యామిలీ రూ. 446 కోట్లతో మూడో స్థానంలో నిలిచారు. అదానీ కుటుంబం రూ. 386 కోట్లు విరాళంగా ఇచ్చింది. కనీసం రూ. 5 కోట్లకు పైగా విరాళం అందించిన వారిని ఈ జాబితాలో చేర్చారు.

# ఏపీలో 1,150 లాయర్ల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున సాయం

అమరావతి: ఏపీ ప్రభుత్వం మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు అండగా నిలుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు రూ. 46 కోట్లను విడుదల చేసింది. ప్రతి కుటుంబానికి రూ. 4 లక్షల చొప్పున ఈ సాయం అందనుంది. ఈ మేరకు అర్హులైన న్యాయవాదుల జాబితాను ఖరారు చేస్తూ ప్రభుత్వం రెండు వేర్వేరు జీవోలను జారీ చేసింది. "ఏపీ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ మ్యాచింగ్ గ్రాంట్" కింద ఈ నిధులను విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మరణించిన న్యాయవాదికి సంబంధించిన నామినీకి ఈ ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిధుల పంపిణీకి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీ బార్ కౌన్సిల్ కార్యదర్శిని ప్రభుత్వం ఆదేశించింది. న్యాయశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభా దేవి ఈ ఉత్తర్వులను జారీ చేశారు. వృత్తిలో కొనసాగుతూ దురదృష్టవశాత్తు మరణించిన న్యాయవాదుల కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆర్థిక సాయం ఆ కుటుంబాలకు కొంత ఊరట కలిగిస్తుందని భావిస్తున్నారు.

# సీఎం రేవంత్ భాష వీధి రౌడీలా ఉంది

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను "తాట తీస్తా, తొక్కుతా" అంటూ సీఎం హెచ్చరించడాన్ని ఆమె తప్పుబట్టారు. సీఎం వాడిన భాష వీధి రౌడీలు కూడా సిగ్గుపడేలా ఉందని ఘాటుగా విమర్శించారు. 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన కవిత, హన్మకొండలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతోనే కాలేజీ యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. మాట తప్పింది మీరు. అలాంటప్పుడు వారి తాట, తోలు తీస్తామని అనడం ఎంతవరకు సమంజసం? తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిలబడిన వారిపై మీ వీరంగమా?" అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, యాజమాన్యాలను బెదిరించే ధోరణి అవలంబిస్తోందని కవిత ఆరోపించారు. విద్యార్థుల కోసం పోరాడుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు తాము అండగా ఉంటామని, వారి తరఫున పోరాడతామని ఆమె భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి కానీ, బెదిరింపులతో కాదని హితవు పలికారు.

# చొరబాటుదారుల పేరుతో ముస్లింలను కించపరుస్తున్నారు

హైదరాబాద్: ప్రతిపక్షాలు చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయన్న బీజేపీ ఆరోపణలను ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఒకవేళ దేశంలోకి చొరబాటుదారులు వస్తున్నారంటే, అది పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమేనని, ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నితీశ్ కుమార్ దీనికి బాధ్యత వహించాలని ఆయన అన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్‌కు ముందు కిషన్‌గంజ్‌లో ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ముఖ్యమంత్రి మీవాడే, కేంద్ర హోంమంత్రి మీవాడే, ప్రధాని కూడా మీరే. మీ కళ్లెదుటే చొరబాటుదారులు ఎలా వస్తున్నారు? ఒకవేళ వారు వస్తున్నారంటే అది మీ పరిపాలనా వైఫల్యమే కదా? మీ చేతుల్లో బీఎస్ఎఫ్, సీమా సురక్షా బల్ ఉన్నాయి. అయినా చొరబాటులు జరుగుతున్నాయని మీరే ఆరోపిస్తున్నారు" అని ఒవైసీ ప్రభుత్వాన్ని నిలదీశారు. చొరబాటుదారుల ఆరోపణను తిప్పికొడుతూ, "ఇక్కడేమైనా బంగారు గనులు దొరికాయా? లేక చమురు నిక్షేపాలు బయటపడ్డాయా? ప్రజలు గుంపులు గుంపులుగా వలస రావడానికి? సీమాంచల్ ప్రాంత ముస్లింలు దేశ విభజన సమయంలో బంగ్లాదేశ్‌కు వెళ్లకుండా భారత్‌నే తమ దేశంగా ఎంచుకున్నారు. వారిని ఇప్పుడు చొరబాటుదారులు అని నిందిస్తున్నారు. కనీసం 10 మంది చొరబాటుదారుల పేర్లయినా బీజేపీ చెప్పగలదా?" అని ఆయన సవాల్ విసిరారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లింల కోసం ఏమీ చేయనందుకే, వారిని కించపరిచేలా బీజేపీ మాట్లాడుతోందని ఆరోపించారు. సీమాంచల్ ప్రాంత అభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఒవైసీ విమర్శించారు. "పాట్నా, దర్భంగా, భాగల్‌పూర్‌లలో ఎయిమ్స్, ఐఐటీలు కట్టామని ప్రధాని చెబుతారు. కానీ అరరియాలో ఏం చేశారో చెప్పలేరు. అందుకే ఇక్కడి యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తోంది" అని ఆయన పేర్కొన్నారు. ఓట్ల దొంగతనం జరుగుతోందన్న రాహుల్ గాంధీ ఆరోపణలపై మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలను చాలాసార్లు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఒవైసీ సూచించారు. "మనం పోటీ పడుతోంది బీజేపీతో. కళ్లు మూసి తెరిచేలోపు మిమ్మల్ని మాయం చేయగలరు" అని ఆయన వ్యాఖ్యానించారు. 2020 బీహార్ ఎన్నికల్లో ఒవైసీ పార్టీ సీమాంచల్ ప్రాంతంలో 5 స్థానాలు గెలిచి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

# ఏపీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

గొల్లపూడి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలుగుదేశం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఇవాళ గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వెంకట వసంత కృష్ణప్రసాద్ సందర్శించారు.పలు అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడారు. గొల్లపూడి మార్కెట్ యార్డులో రైతు కొనుగోలు సేవా కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. గొల్లపూడి మార్కెట్ యార్డులో రూ. 1.50 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. సీఎం చంద్రబాబు గొల్లపూడి యార్డులో వివిధ పనులకు రూ. 10 కోట్ల నిధులు మంజూరు చేశారని వెల్లడించారు. మార్కెట్ యార్డుకి శాశ్వత ఆదాయాన్ని తీసుకువచ్చే 90 దుకాణాల నిర్మాణ పనులు 85 శాతం పూర్తి అయ్యాయని ఎంపీ చిన్నివెల్లడించారు.

# కార్తీకమాస లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న.. కందుకూరు ఎమ్మెల్యే





గాయత్రి వార్తలు

విపిఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్తీకమాస లక్ష దీపోత్సవ కార్యక్రమం మూడోవ రోజు శనివారం రాత్రి నెల్లూరు విఆర్సీ మైదానంలో ఘనంగా నిర్వహించారు. విపిఆర్ దంపతులు ఆహ్వానం మేరకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తో కలిసి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మరియు జిల్లాలోని పలువురు ముఖ్య నాయకులు లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్తీక మాస లక్ష దీపోత్సవం కార్యక్రమం సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతులు రామానంద భారతీ స్వామివారి సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.

# కార్తీక మాసం సందర్భంగా సంగమేశ్వరం ఆలయంలో వనభోజన కార్యక్రమం

గాయత్రి వార్తలు





సోమవారం రోజు కార్తీక మాసం సందర్భంగా పొన్నలూరు మండలం చెన్నిపాడు గ్రామం నందు వేంచేసి ఉన్న శ్రీ గంగా సమేత సంగమేశ్వర స్వామి దేవస్థానం నందు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కార్తీక మాస వన భోజనాల ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి వర్యులు లిడా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మరియు రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్శ్రీ దామచర్ల సత్య విచ్చేయుచున్నారు. కావున నియోజికవర్గం లోని ఆరు మండలాల నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం.

# చాకచక్యముతో క్షేమంగా పిల్లలను తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు

## - పోలీస్ వారికి ధన్యవాదాలు తెలిపిన పిల్లల తల్లిదండ్రులు

గాయత్రి వార్తలు



తప్పిపోయిన ముగ్గురు పిల్లలలను గంటల వ్యవధిలో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చిన కందుకూరు పోలీసులు తేది.07.11.25 న సాయంత్రం, కందుకూరుకు చెందిన 13 సంవత్సరాల వయస్సు గలిగిన ముగ్గురు పిల్లలు ట్యూషన్ కి అని వెళ్లి ఇంటికి రాలేదని, రాత్రి 11 గంటల సమయంలో కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిందండ్రులు. జిల్లా యస్.పి. డా. అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, కందుకూరు డి.ఎస్.పి సుబ్రహ్మణ్యం అధ్వర్యంలో, కందుకూరు సీఐ అన్వర్ బాషా , ఎస్ఐ, సిబ్బందిని రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పరిచి, బీట్ మరియు మొబైల్ పార్టీలను అప్రమత్తం చేసి, బస్టాండ్, రైల్వే స్టేషన్ లలో రాత్రంతా శోధించిన కందుకూరు పోలీసులు.పోలీసుల సమర్థవంతమైన సమన్వయం మరియు క్షుణ్ణంగా నిర్వహించిన శోధన ఫలితంగా, తప్పిపోయిన ముగ్గురు పిల్లలను అనకాపల్లి ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు.తల్లిదండ్రులకు పిల్లలు ఉన్నారని తెలపడంతో ఊపిరి పీల్చుకున్నారు.తప్పిపోయిన పిల్లలను కనుగొని క్షేమంగా గంటల వ్యవధిలో వారి తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా చేర్చడంలో పోలీసులు చాకచక్యాన్ని ప్రదర్శించారు.అనంతరం పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి, చిన్నపిల్లల సంరక్షణలో అశ్రద్ధ పనికిరాదని మందలిస్తూ తప్పిపోయిన వారిని క్షేమంగా వారికి అప్పగించడం జరిగింది.క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు పిల్లలను చేర్చడంతో ఆనందభాష్పాలతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు, అభినందించిన జిల్లా యస్.పి, ప్రజలు ఈ సంఘటనను చూసిన బంధువులు మరియు ప్రజలు కూడా పోలీసుల త్వరితమైన మరియు సమర్థవంతమైన చర్యలకు అభినందనలు తెలియజేశారు.ప్రజల సురక్షిత భావానికి మా బాధ్యత అనేది మా మొదటి భాధ్యత. పోలీసు బృందాలు రాత్రింబవళ్లు పని చేశారు. ఈ రక్షణ చర్యలో భాగంగా పోలీసులు చూపిన స్పందన మరియు నైపుణ్యం చాలా గర్వకారణం.కందుకూరు పోలీసుల ఈ వేగవంతమైన మరియు మానవీయ చర్య, ప్రజా సేవలో వారి నిబద్ధతను చాటింది. ఈ సంఘటన పోలీసులు మరియు సమాజం మధ్య సాన్నిహిత్య బాంధవ్యాన్ని మరింత బలోపేతం చేసింది.

# "నా స్కూలు, నా గర్వం" శతదినోత్సవ వేడుకలకు పూర్వ విద్యార్థులను ఆహ్వానించిన ప్రధానోపాధ్యాయులు



శ్రీకాళహస్తి, నవంబర్ 9 (గాయత్రి వార్తలు):
రిపోర్టర్ : రంజిత్

శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్పీబీఎస్ జెడ్పీ బాయ్స్ హైస్కూల్ 104వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. పాఠశాల శతదినోత్సవ వేడుకలను రాబోయే సంవత్సరం (2026)లో ఘనంగా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది.ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, పురుషోత్తం, గోపాలకృష్ణ, రామచంద్రయ్య, రంగయ్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శతదినోత్సవాల నిర్వహణకు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసి, కార్యక్రమాలు సమగ్రంగా చేపట్టాలని నిర్ణయించారు.ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య మాట్లాడుతూ, "నేను ఈ పాఠశాల విద్యార్థిని, ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడిగా సేవలు అందించడం గర్వకారణం. నా ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సహకారంతో శతదినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం," అని పేర్కొన్నారు.

# బృందమ్మ చేతులమీదుగా కేక్ కటింగ్ మహిళా నాయకురాలు కుమారి జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి, నవంబర్ 9 (గాయత్రి వార్తలు):
రిపోర్టర్ : రంజిత్

శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగు మహిళా నాయకురాలు కుమారి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలుగు మహిళల అధ్యక్షురాలు బొజ్జల బృందమ్మ ఆధ్వర్యంలో మహిళా నాయకులు పాల్గొని కేక్ కటింగ్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బృందమ్మ మాట్లాడుతూ ు "మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలుగు మహిళా నాయకురాలు కుమారి సేవలు ప్రశంసనీయమైనవి. ఆమెకు దీర్ఘాయుష్మత్కం కలగాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు.

# భరద్వాజ తీర్థంలో జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక సమారాధన, వనభోజనం ఘనంగా జరిగింది





శ్రీకాళహస్తి, నవంబర్ 9 (గాయత్రి వార్తలు):
రిపోర్టర్ : రంజిత్

శ్రీకాళహస్తి జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భరద్వాజ తీర్థం (లోబావి) వద్ద కార్తీక సమారాధన, వనభోజనం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖులకు పూర్ణకుంభ స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, దేవస్థాన చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యురాలు కోలా విశాలాక్షి, జంగమ పెద్దలు రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.తదుపరి త్రిమూర్తి స్వరూపమైన ఉసిరి చెట్టు ఆరాధన, స్వామి అమ్మవార్ల పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం వనభోజనం నిర్వహించగా, ప్రముఖులు స్వయంగా వడ్డన చేసి జంగమ కులస్తులను ఆనందింపజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన ప్రముఖులు "శ్రీకాళహస్తి జంగమ కులస్తుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని" హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జంగమ కమిటీ సభ్యులు, జంగమ కులస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ అయ్యప్ప స్వామి దీక్ష నిత్య పూజ నియమావళి పుస్తకావిష్కరణ



శ్రీకాళహస్తి, నవంబర్ 9 (గాయత్రి వార్తలు)
రిపోర్టర్ : రంజిత్

శ్రీకాళహస్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో "శ్రీ అయ్యప్ప స్వామి దీక్ష నిత్య పూజ నియమావళి" పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వాత్మానంద స్వాములు, శ్రీ విద్యాస్వరూపానంద గిరి స్వాములు, మరియు ఎండోమెంట్స్ హెచ్‌డీ పీటీ చైర్మన్, ఐఏఎస్ దాసరి శ్రీనివాసులు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ పుస్తకాన్ని శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి వ్యవస్థాపకులు, జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు గ్రహీత కాళహస్తి మురళి గురు స్వామి రచించారు.ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రముఖులు తెలిపారు ు "అయ్యప్ప స్వామి దీక్షను సాధారణ దీక్షగా కాక, ఆధ్యాత్మిక శుద్ధి సాధనగా భావించాలి. పూర్వం 48 రోజుల కటోర దీక్ష, ఎరుమేలి మార్గం ద్వారా అయ్యప్ప దర్శనం సాధన ఎంత పవిత్రమో, ఈ పుస్తకం యువతకు ఆ ఆచార సంప్రదాయాలపై అవగాహన కలిగిస్తుంది. మాలాధారణ నుంచి పూజా నియమాల వరకు ప్రతిదీ ఇందులో వివరించబడింది" అని అన్నారు.పుస్తకావిష్కరణ అనంతరం అవధాని ఆముదాల మురళి, కన్యకా పరమేశ్వరి దేవాలయ చైర్మన్, నడవాటి శరవణ నందం దొర కుమార్, భక్తులు, సంఘ సేవకులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న అధికారులు.. విరాళాలతో వృద్ధుడి అంత్యక్రియలు



పర్చూరు: (గాయత్రి వార్తలు)

భార్య మృతి చెంది మూడు నెలలైంది. అనారోగ్యంతో భర్త ఆస్పత్రిలో చేరాడు. అండగా ఉంటాడనుకున్న కుమారుడు మద్యానికి బానిసయ్యాడు. తండ్రి మరణించాడని తెలిసి కూడా అతని కుమారుడు కన్నెత్తి చూడలేదు. దీంతో అధికారులు స్పందించి.. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన చీరాల శ్రీనివాసరావు (60), అన్నపూర్ణ భార్యాభర్తలు. వీరి కుమారుడు సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. మూడు నెలల క్రితం అన్నపూర్ణ మరణించారు. సురేశ్‌కు గతంలో వివాహం కాగా.. భార్యాభర్తలు దూరంగా ఉంటున్నారు. ఈ నెల 6న తండ్రి శ్రీనివాసరావు అనారోగ్యానికి గురికావడంతో.. సురేశ్ పర్చూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్చి వెళ్లిపోయాడు. చికిత్స పొందుతూ అతడు ఈ నెల 7న మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో ఆసుపత్రి అధికారులు పర్చూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జీవీ చౌదరి నూతలపాడులో విచారించగా.. సురేశ్ మద్యానికి బానిసయ్యాడని, బందువులు చీరాలలోని హస్తినాపురంలో ఉంటారని తెలిసింది. దీంతో బంధువులకు సమాచారం ఇచ్చి.. సురేశ్ కోసం పోలీసులు గాలించారు. ఆదివారం సురేశ్‌ను గుర్తించి.. బంధువుల ఆధ్వర్యంలో మృతదేహం అప్పగించారు. దహన సంస్కారాలకు తన వద్ద డబ్బుల్లేవని సురేశ్ చెప్పడంతో.. తమవంతుగా పోలీసులు, పంచాయతీ అధికారులు ఆర్థిక సాయం చేశారు. అనంతరం పర్చూరు హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

# తుపాను తుంచింది..

తుపాను తుంచింది..

(గాయత్రి వార్తలు)



మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు పత్తి రైతును నిండా ముంచాయి. పంట చేతికొచ్చే తరుణంలో తడిసి రంగు మారింది. దీనికితోడు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఇంకా కేంద్రాలను తెరవలేదు. ఇదే అదునుగా దళారులు రైతులను దోచుకుంటున్నారు. దాచుకునేందుకు మార్గంలేక, దళారులు ఇచ్చే ధర గిట్టుబాటుకాక సతమతమవుతున్నారు. జిల్లాలో సుమారు 9వేల హెక్టార్లలో పత్తిసాగవుతోంది. తుపానుకు కిందకు పడిపోయిన పంటనే గుర్తించారు. ఈ మేరకు 10.09 ఎకరాల్లో నష్టం కలిగినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రంగుమారిన పత్తిని లెక్కల్లోకి తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు సాధారణంగా 9 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. ప్రస్తుతం 2 నుంచి 3 క్వింటాళ్ల లోపు వస్తోంది. ఎకరాకు సాగుఖర్చులే రూ.25 వేలు కాగా.. రూ.20 వేలు కూడా రావడంలేదని వాపోతున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ











గాయత్రి వార్తలు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11వ తేదీన పీసీ పల్లి మండలం లింగన్నపాలెం గ్రామంలో మధ్య, చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమల ( ఎం.ఎస్.ఎం.ఈ ) పార్కు ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేయుచున్న సందర్భంగా ముందస్తు ఏర్పాట్లను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి జిల్లా కలెక్టర్ పి. రాజబాబు, జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., కనిగిరి ఎమ్మెల్యే శ్రీ డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మరియు జిల్లా అధికారులు పరిశీలించారు. జిల్లా ఆనంతరం ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం నియమించిన ప్రత్యేక అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు తెలియచేశారు. ఈ సందర్భం ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెలిప్యాడ్ ప్రదేశం, సభ వేదిక, పార్కింగ్ ప్రాంతాలను, సీఎం కాన్వాయ్ రూట్ మరియు చుట్టు ఉన్న ప్రాంతములను క్షుణ్ణంగా పరిశీలించి అక్కడ జరుగుతున్న అన్ని ఏర్పాట్లను సమీక్షించారు. ఇంకా తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం ఎస్పీ వీఐపీల వాహనాల రాక, సభా స్థలంలో డయాస్, పార్కింగ్ ఏరియా, సీఎం ప్రవేశం, నిష్క్రమణ స్థలాలను, హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ఉన్న రూట్ ను, క్షుణ్ణంగా పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. సీఎం పర్యటన సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా మరియు బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని, ఇతర శాఖల సమన్వయంతో అన్ని చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట %నూా+% అడిషనల్ ఎస్పీ యస్.వి రమణ, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎఆర్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు, పిసీఆర్ సిఐ దుర్గ ప్రసాద్,యం. శ్రీనివాసరావు, కనిగిరి సిఐ ఖాజావల్లి, పామూరు సిఐ యం.శ్రీనివాసరావు, అర్ఐ రమణ రెడ్డి, ఎస్సైలు మరియు తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వం ధ్యేయం











**- రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ దేశ, విదేశాలు తిరుగుతున్నారు**

**- విశాఖ పెట్టుబడుల సదస్సు ద్వారా 7.2 లక్షల ఉద్యోగాలు**

**- వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ ఏర్పాటు శుభపరిణామం**

**- వైసీపీ హయాంలో ప్రకాశం జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యం**

**- ప్రకాశం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ కి జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు**

**- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**- పీసీపల్లి మండలం లింగన్నపాలెంలో ఈనెల 11న జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి**

గాయత్రి వార్తలు

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలో ఈనెల 11న జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు స్థానిక శాసనసభ్యుడు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ఆదివారం నాడు మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై మంత్రి అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డా.డోలా బాల వీరాంజ నేయస్వామి మాట్లాడుతూ..వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ఎం.ఎస్.ఎం.ఈ పార్కులు, బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుచేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈనెల 11 న పీసీ పల్లితో పాటు రాష్ట్రంలో మరి కొన్ని ఎం.ఎస్.ఎం.ఈ పార్కులు పర్చువల్ గా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. నిరుద్యోగి రహిత ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ కాలికి బలపం కట్టుకొని దేశ విదేశాల్లో పర్యటిస్తున్నారన్నారు. లోకేశ్ దీపావళి పండుగ నాడు కూడా కుటుంబ సభ్యులతో గడపకుండా పెట్టుబడుల కోసం విదేశాల్లో తిరుగుతూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. విశాఖలో పెట్టుబడుల సదస్సు ద్వారా 7.2 లక్షల ఉద్యోగుల కల్పన దిశగా ఎంఓయూలు కుదుర్చుకోనున్నాం. వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి మార్కాపురం కేంద్రంగా జిల్లా, త్వరితగతిన వెలుగొండ పూర్తికి ప్రత్యేక ప్రణాళికలతో జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రి లోకేష్ కి జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# పట్టణశాఖ ప్రవాస్ యోజన కార్యక్రమం

గాయత్రి వార్తలు

స్థానిక భాజపా పట్టణ శాఖ కార్యాలయంలో అధ్యక్షులు మన్నేపల్లి వరప్రసాదరావు అధ్యక్షతన జరిగిన పట్టణశాఖ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు పొందూరు వెంకటకృష్ణారెడ్డి పాల్గొని పార్టీకి కార్యకర్తలేబలమని, పూర్తిస్థాయిలో క్రియాశీలక సభ్యులను నియమించుకొని పట్టణ శాఖ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని, పార్టీలో ప్రతి కార్యకర్త నాయకుడేనని, బూత్ కమిటీలు, శక్తి కేంద్ర బాధ్యులు, వివిధ మోర్చాల కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నాదుల రాఘవయ్య నియోజకవర్గ సమన్వయ, సహసమన్వయ కర్తలు ఘట్టమనేని హరిబాబు జొన్నాదుల సురేష్ జిల్లా ఎస్టి మోర్చా ఉపాధ్యక్షులు జగన్నాథం వైకుంఠం రూరల్ మండల అధ్యక్షులు చల్ల వెంకటరాజా పట్టణ శాఖ ఉపాధ్యక్షులు అమలనాథుని మాల్యాద్రి నాయుడు కార్యదర్శి యద్దనపూడి శ్రీధర్ సీనియర్ నాయకులు మువ్వల భూషయ్య తానికొండ కోటయ్య వేముల సుబ్బారావు ఆలూరు రాజేశ్వరరావు జి మోజెస్ వెంకటరాయుడు శివ స్వామి మహిళా నాయకురాలు దార్ల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

